


రోడ్డు పనులపై ఆరోపణలు వాస్తవ దూరం

మంచిర్యాల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం కొర్విచల్మ పంచాయతీలో ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులపై వచ్చిన ఆరోపణలు వాస్తవదూరమని ఎంపీడీవో ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోడ్డు ఇంకా నిర్మాణ దశలో ఉన్నదని, పనులు పూర్తి కాలేదని పేర్కొన్నారు. ఆ రోడ్డుకు ఇరువైపులా కూలీలే మట్టి పోశారని చెప్పారు. వర్షాల కారణంగా పనులు నిలిచిపోయామని తెలిపారు. రోడ్డుపై మొరం పోయాల్సి ఉందని పేర్కొన్నారు. పనులు పూర్తి కాక ముందే ఆరోపణలు చేయడం సరికాదని తెలిపారు. ఎస్టిమేషన్ ప్రకారం అంచనా విలువ రూ. 9,32,184 కాగా ఇందులో రూ. 6,02,084 చెల్లించామని తెలిపారు. మెటీరియల్ పేమెంట్ ఇంతవరకు జరగలేదని తెలిపారు. ఉపాధిహామి పథకం పనులను కాంట్రాక్టర్లు చేయరని, కూలీలే చేస్తారని స్పష్టం చేశారు. పనులు పూర్తి అయిన తరువాత నాణ్యతా ప్రమాణాలపై సోషల్ ఆడిట్‌లో తనిఖీలు జరుగుతాయని తెలిపారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



జైపూర్‌లోని పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

జైపూర్, జూలై 26: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రైమరీ పాఠశాలను శుక్రవారం కలెక్టర్ తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించారు. గదుల్లో వర్షం నీరు పడుతుండడం లాంటి సమస్యలున్నాయా అని హెచ్ఎం ఆలీష్‌మాధుర్యను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. ప్రైమరీ పాఠశాలలో కొందరు ఉపాధ్యాయులు లీవు లెటర్ మాత్రమే రాశారని, ఆన్‌లైన్‌లో ఎందుకు నమోదు చేయలేదని ప్రధానోపాధ్యాయులను ప్రశ్నించారు. లీవులో ఉన్న సదరు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. విద్యార్థులకు చదువు నిమిత్తం ప్రభుత్వం ఎన్నో నిధులు సమకూరుస్తుందని. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 26 : జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారంమండల ప్రత్యేక అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి నాణ్యత ప్రమాణాలు పరిశీలించి నివేదికలను అందించా లన్నారు. నివేదికల ఆధారంగా బిల్లులు చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. విద్యార్థులకు అందించే భోజనం, తాగునీరు, ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. గ్రామాల్లో తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలన్నారు. అంగన్‌వాడీ , ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలను పరిశీలించాలన్నారు. వన మహోత్సవంలో నిర్ధేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. నర్సరీల్లో వెదురు,యూకలిప్టస్ మొక్కలను పెంచాలన్నారు. వర్షాకాలం అయినందున వ్యాధుల నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



నినాదాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 26: జిల్లా కేంద్రంలో కాలేజీ రోడ్డులో ఎస్ఎఫ్ఐ నాయకులు బడ్జెట్‌లో విద్యారంగానికి మొండి చేయి చూపడాన్ని నిరసిస్తూ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అభినవ్ మాట్లాడుతూ బడ్జెట్‌లో విద్యారంగానికి రూ. 21,292 కోట్లు కేటాయించారని ఈ నిధులతో ప్రభుత్వ విద్య అభివృద్ధి కాదని తెలిపారు. యూనివర్సిటీలకు రూ. 500 కోట్లు కేటాయించి చేతులు దులుపుకుందని, ఇవి సరిపోవని చెప్పారు. బాసర ఐఐటీ కళాశాల లాగా మరో రెండు ఏర్పాటు చేస్తామని చెప్పి ఆ ఊసెత్తలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పి మాట తప్పిందన్నారు. వెంటనే బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించాలని కోరారు. లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అరవింద్, మానస, శ్రావణి, మమత, జశ్వంత్, రవి తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

కోటపల్లి, జూలై 26: కోటపల్లి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహంలోని విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. వసతి గృహం విద్యార్థులతో కలిసి వసతి గృహం ఎదుట శుక్రవారం బీజేపీ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వసతి గృహం భవనం 50 సంవత్సరాల క్రితం నిర్మించారని చెప్పారు. ప్రస్తుతం శిథిలమైపోవడం, వర్షానికి గదుల్లో నీరు చేరుతుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సంబంధిత అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వసతి గృహంలో ఆరు గదులు మాత్రమే ఉండగా గత వారం రోజు లుగా కురుస్తున్న వర్షాలతో నీరు చేరుతుందన్నారు. ఎప్పుడు వసతి గృహం కూలు తుందోననే భయం నెలకొందని విద్యార్థులు తెలిపారు. మరో వైపు మరుగుదొడ్లు, స్నానపు గదులు సైతం సరిపోవడం లేదని చెప్పారు. శిథిలమైన వసతి గృహాన్ని తొలగించి కొత్త వసతి గృహం నిర్మించాలని కోరారు. సుమారు 200 మంది విద్యార్థులు వసతి గృహంలో ఉంటుండగా గదుల సౌకర్యం లేకపోవడంతో అవస్థల పాలవుతున్నారని, చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సమస్యలను పరి ష్కరించాలని బీజేపీ నాయకులు తహసీల్దార్ మహేందర్‌కు వినతి పత్రం అందజే శారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మంత్రి రామయ్య, నాయకులు గో నె మోహన్‌రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ

మందమర్రి టౌన్, జూలై 26: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌ను పె ద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ శుక్రవారం డిల్లీలో కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విభజన హామీలకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రగతి, ప్రజాప్రయోజనాల దృష్ట్యా నిధుల కేటాయింనకు చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.



నిర్మల సీతారామన్‌కు విజ్ఞప్తి చేస్తున్న ఎంపీ వంశీ

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 26 : విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి మడావి గంగారాం అన్నారు. మంచిర్యాలలోని పోస్టుమెట్రిక్ బాలికల వసతి గృహంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖలోని కుక్, కామాటీలకు ఆహార భద్రత-పరిశుభ్రత అంశంపై శుక్రవారం ఏర్పాటు చేసిన ఒక్క రోజు శిక్షణ కార్యక్రమానికి ఏటీడీవో చిరంజీవితో కలిసి హాజరై మాట్లాడారు. వర్షాకాలం కావడంతో అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించాలన్నారు. తాజా కూరగాయలతో వంట చేసి మెనూ ప్రకారం అందించాలన్నారు. వసతి గృహంలో దోమలు పెరుగకుండా బ్లీచింగ్ పౌడర్, ఆయిల్‌బాల్స్ పిచికారి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వసతిగృహ పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.



కోటపల్లి మండలంలో ప్రాణహిత బ్యాక్ వాటర్‌లో మునిగిన పత్తి పంట

- ఉప్పొంగుతున్న గోదావరి, ప్రాణహిత
- ఐదు రోజులుగా నీటిలోనే పంట చేలు
- జిల్లాలో 27.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు
- ఎల్లంపల్లి ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద
- ఓసీల్లో ముందుకు సాగని బొగ్గు ఉత్పత్తి

ఎడతెరపి లేని వర్షం

మంచిర్యాల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎనిమిది రోజులుగా వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజల జనజీవనం అస్తవ్యస్తం గా మారింది. ఇంటి నుంచి అడుగు బయట పెట్టలేని పరిస్థితులు నెల కొన్నాయి. మారుమూల గ్రామాల్లో రోడ్లన్నీ బురదమం కాగా కాలినడక వెళ్లేందుకు కూడా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షాల కారణంగా గోదావరి, దాని ఉపనది అయిన ప్రాణహితలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. కాగా ప్రాణహిత బ్యాక్ వాటర్‌తో కోటపల్లి మండలంలోని వెంచపల్లి, జనగామ, సూపాక, సిర్సా, పుల్లగాం, అన్నారం, వేమనపల్లి మండలంలోని ముల్కలపేట, గొర్లపల్లి, రాచర్ల గ్రామాల్లోని నీట మునిగిన వేలాది ఎకరాల పత్తిపంట ఐదు రోజులుగా నీటిలోనే మగ్గుతోంది.

జిల్లాలో గడిచిన 24 గంటల వ్యవధిలో 27.1 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. జైపూర్ మండలంలో 44.3, భీమిని మండలంలో 40.0, కన్నెపల్లి మండలంలో 36.8, నస్పూర్ మండలంలో 36.4, నెన్నెల మండలంలో 35.3, భీమారం మండలంలో 34.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బెల్లంపల్లి మండ లంలో 31.7, వేమనపల్లి మండలంలో 31.0, కోటపల్లి మండలంలో 30.8, కాసిపేట మండలంలో 28.6, మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో 25.5, హాజీ పూర్ మండలంలో 20.8 మి.మీ. వర్షపాతం నమోదైంది.

బెల్లంపల్లి: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని 28వ వార్డులో ఖమ్మం భూదేవికి చెందిన ఇల్లు కూలిపోయింది. ఇల్లు కూలిన సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సుమారు లక్ష రూపాయల నష్టం వాటిల్లిందని వృద్ధురాలు తెలిపింది. ఇందిరమ్మ ఇల్లు వచ్చేలా ఎమ్మెల్యే చొరవ చూపాలని ఎంసీ పీఐయూ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ కోరారు.

వేమనపల్లి: మంలంలోని సుంపుటం వద్ద ప్రాణహిత నది బ్యాక్ వాటర్‌ను మండల ప్రత్యేకాధికారి ఉదయ్‌కుమార్ శుక్రవారం పరిశీ లించారు. అధికారులు బారికేడ్లు పెట్టి రోడ్లను మూసి వేసి నందున ప్రజలు ఈ మార్గంలో వెళ్లవద్దని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో దేవేందర్ రెడ్డి, వైద్య సిబ్బంది ఉన్నారు.





వేమనపల్లిలో ప్రాణహిత నది బ్యాక్ వాటర్‌ను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి ఉదయ్‌కుమార్, బెల్లంపల్లిలో వర్షాలకు కూలిన ఇల్లు

సీజనల్ వ్యాధులపై దృష్టి సారించాలి

లక్షెట్టిపేటరూరల్, జూలై 26: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డీపీవో వెంకటేశ్వర్ రావు ఆదేశించారు. లక్షెట్టిపేట మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీల్లో షిఫ్టింగ్,గ్రేడింగ్ చేయాలని ఖాళీగా ఉన్న బ్యాగుల్లో వెదురు, నీలగిరి, ఈత , ఖర్జుర విత్తనాలను నాటాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అమ్మఆదర్శ కమిటీ పనులను సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి రుచికరంగా వండాలని సూచించారు. ప్రతీ శుక్రవారం డ్రైడే నిర్వహించాలని ఆదేశించారు.

ఎల్లంపల్లికి 23,701 క్యూసెక్కుల నీరు..

హాజీపూర్ మండలం గుడిపేట సమీపంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 23,701 క్యూసెక్కుల నీరు చేరుతోంది. కడెం ప్రాజెక్టు గేట్ల ద్వారా 8412 క్యూసెక్కులతోపాటు స్థానికంగా కురిసిన వర్షాల కారణంగా మరో 15,289 క్యూసెక్కులు ప్రాజెక్టులోకి చేరుతోంది. ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 148 మీటర్లకు గాను ప్రస్తుతం 146.49 మీటర్ల ఎత్తుకు నీళ్లు చేరుకున్నాయి. ప్రాజెక్టు సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా ప్రస్తుతం 16.109 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది.

ఓపెన్ కాస్టు గనుల్లో..

వర్షాల కారణంగా జిల్లాలోని శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి సింగరేణి డివిజన్‌లలోని ఓపెన్ కాస్టు గనుల్లో బొగ్గు తవ్వకాలు, ఓబీ మట్టి తొలగింపు పనులు నిలిచిపోయాయి. మూడు ఏరియాల్లోని శ్రీరాంపూర్, ఇందారం, రామకృష్ణాపూర్, మందమర్రి, గోలేటి, ఖైరిగూడ ఓసీపీల్లో గత ఎనిమిది రోజులుగా భారీ వాహనాలు తిరిగేందుకు అవకాశంలేక బయట నిలిపి ఉంచారు. దీంతో దాదాపు రూ. 58.5 కోట్ల విలువైన బొగ్గు ఉత్పత్తికి నష్టం వాటిల్లగా, రూ. 18 కోట్ల విలువైన ఓబీ మట్టి వెలికితీత పనులు నిలిచిపోయాయి.

క్రీడాకారుడికి అభినందన

ఏసీసీ, జూలై 26: హనుమకొండలో ఈ నెల 23 నుంచి 26 వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ అండర్ 17 బ్యాడ్మింటన్ పోటీల్లో మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో రాణించిన మంచిర్యాల జిల్లా క్రీడాకారుడు ఆదిత్య హర్షవర్ధన్‌ను పలువురు అభినందించారు. ఆదిత్యహర్షవర్ధన్, రంగారెడ్డి జిల్లా క్రీడాకారిణి రిషితపాండేతో కలిసి ఫైనల్‌లో గెలుపొందాడు. హనుమకొండలోని వరంగల్ క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన ముగింపు వేడుకల్లో వరంగల్ సిటీ పోలీస్ కమిషనర్ అంబర్‌కిశోర్‌ఝా చేతుల మీదుగా ట్రోఫీ, సర్టిఫికెట్ అందుకున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసి యేషన్ ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్, చైర్మన్ ముకేష్‌గౌడ్, ఉపాధ్యక్షుడు వాసు, మీ నారెడ్డి, ట్రెజరర్ సత్యపాల్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీలు రమేష్‌రెడ్డి, మధు అభినందిచారు.

సమస్యలు పరిష్కరించాలి

- మున్సిపల్ కమిషనర్‌కి నాయకుల వినతి

రామకృష్ణాపూర్, జూలై 26: క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను పరిష్క రించాలని శుక్రవారం బీజేపీ నాయకులు వేముల అశోక్, 11వ వార్డు కౌన్సిలర్ గడ్డం సంపత్‌ల ఆధర్యంలో మున్సిపల్ కమిషనర్ మురళి కృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు మాసు సత్యనారాయణ, కట్ట ఈశ్వరచారి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు వైద్య శ్రీనివాస్, సాయికృష్ణ, సంతోష్ రాంనాయక్, బద్రి సతీష్, ఆడెపు చంద్రమో హన్, కొండ రాజ బాబు, హనుమాండ్ల సత్యం తదితరులు పాల్గొన్నారు.

సదరం శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 26: జిల్లాలో ఆగస్టు 2వ తేదీ నుంచి నిర్వహించనున్న సదరం శిబిరాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీవో కిషన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మీసేవలో స్లాట్ బుక్ చేసుకుని సదరం సర్టిఫికెట్ కాల పరిమితి ముగిసిన వారు రెన్యూవల్ కోసం హాజరు కావాలని సూచించారు. నూతనంగా ధ్రువపత్రం పొందేందుకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్ణీత తేదీల్లో వైద్యులను సంప్రదించాలని కోరారు. ఆగస్టు 2,8,12,27 తేదల్లో శారీరక దివ్యాంగులు 65 మంది, 5, 20 తేదీల్లో మూగ, చెవుడు 65 మంది,14, 18 తేదీల్లో కంటి చూపు 40 మంది, 28న మానసిక దివ్యాంగులు 65 మంది పరీక్షల కోసం హాజరు కావాలని తెలిపారు.

ఈఎస్ఐ ఆస్పత్రుల ప్రారంభానికి అనుమతించాలి

శ్రీరాంపూర్, జూలై 26: సింగరేణి సంస్థ విస్తరించి ఉన్న ఏరియాల్లో ఈఎస్ఐ ఆస్పత్రుల ప్రారంభానికి అనుమతించాలని సీఎండీ ఎన్. బలరాం కోరారు. ఈ మేరకు ఆయన డిల్లీలో ఉన్న ఈఎస్ఐ డైరెక్టర్ జనరల్ కమల్ కిషోర్ సోనును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి విజ్ఞప్తి చేశారు. సింగరేణిలో 25 వేల మంది కాంట్రా క్టు ఉద్యోగులు పని చేస్తున్నారని, వారితో పాటు వారి కుటుంబ సభ్యులకు వైద్య సేవలు అందించాలని విజ్ఞప్తులు వస్తున్నాయన్నారు. కొత్తగూడెం, జైపూర్ (ఎస్‌టీపీపీ)లలో ఈఎస్ఐ ఆస్పత్రులు ప్రారంభించి సేవలు అందించాలని కోరారు. అందుకు అవ సరమైన మౌలిక వసతులు కల్పించేందుకు తాము సహకరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఈఎస్ఐ డైరెక్టర్ జనరల్ కమల్ కిషోర్ సోను మాట్లాడుతూ, ముందస్తుగా ఈఎస్ఐ డిస్పెన్సరీలు ప్రారంభించి, అవసరం మేరకు ఆస్పత్రులుగా మార్చే అవకాశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎండీ

తెగిన వంతెనను పరిశీలించిన ఎంపీడీవో

భీమారం, జూలై 26 : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఖాజీపల్లి నుంచి కొత్తూరు మధ్యలో ఉన్న పెద్దవాగు వంతెన వారం రోజుల క్రితం తెగిపోయింది. వంతెనను శుక్రవారం ఎంపీడీవోసత్యనారాయణ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వంతెన తెగిపోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని, త్వరలోనే పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేయిస్తామని తెలిపారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

వేతన ఖాతాతో ప్రమాద బీమా

శ్రీరాంపూర్, జూలై 26 : హెచ్‌డీఎఫ్‌సీ జీరో అకౌంట్ వేతన ఖాతాతో కాంట్రాక్ట్ కార్మికులకు రూ.30 లక్షల ప్రమాదబీమా వర్తిస్తుందని ఏరియా జీఎం బి. సంజీవ రెడ్డి అన్నారు. భద్రతా విభాగంలో ప్రైవేటు గార్డు లుగా పనిచేస్తున్న సిబ్బందికి ఖాతాలు అందించే ప్రక్రి యను శుక్రవా రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ కార్మికులు సద్వినియోగం చేసుకో వాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఇన్‌చార్జి ఎస్‌ఓ టు జీఎం గోపాల్ సింగ్, డీజీఎం(పర్సనల్) పి అరవిందరావు, ఎస్ఎస్ఓ మురళీ మోహన్, భద్రతా విభాగం సీనియర్, జూనియర్ ఇన్‌స్పెక్టర్లు, షిఫ్ట్ జమేదార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ డ్రై డే నిర్వహించాలి

నస్పూర్, జూలై 26 : పరిసరాల పరిశుభ్రతతో పాటు దోమల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాల్సినవసరం ఉందని మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్ అన్నారు. నస్పూర్ మున్సిపాలిటీలో 25 వార్డుల్లో శుక్రవారం డ్రైడే కార్యక్ర మాన్ని నిర్వహించారు. వార్డుల్లో కౌన్సిలర్లు, ఎఎన్ఎంలు, మెప్మా సిబ్బంది కలిసి ఇళ్ల వద్ద డబ్బాలు, కుండీలు, కూలర్లు, డ్రమ్ముల్లో నిల్వ ఉన్న నీటిని పారబోసారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, వైస్ చైర్మన్ గెల్లు రజిత-మల్లేష్, వివిధ వార్డుల కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

షీటీం సేవలపై అవగాహన

జైపూర్, జూలై 26: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులకు షీటీం సేవలపై శుక్రవారం మంచిర్యాల జిల్లా షీటీం ఎస్ఐ హైమా అవగాహన కల్పించారు. ఈ గుడ్ టచ్ బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు, వరకట్న చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎవరైనా మహిళలను, యువతులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా వేధింపులకు పాల్పడితే రామ గుండం షీటీం నంబర్ 6203923700కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కేజీ బీవీ ఎస్‌వో ఫణిబాల, షీటీం సిబ్బంది జ్యోతి, సతీష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన ఏకరూప దుస్తుల వస్త్రం

ఏసీసీ, జూలై 26: జిల్లాలోని ప్రభుత్వ, లోకల్‌బాడీ , కస్తూరా గాంధీ విద్యాలయాల విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చే ఏకరూప దుస్తుల రెండో జత వస్త్రం బేళ్లు జిల్లాకు చేరాయని డీఈవో యాదయ్య తెలిపారు. శుక్రవారం ట్రిస్కో నుంచి 96,759 మీటర్ల వస్త్రంజిల్లాకు వచ్చిందన్నారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా డీఆర్‌డీఏ ,మెప్మా సమన్వయంతో సెల్ఫ్ హెల్ప్ గ్రూపు సభ్యులకు పంపిణీ చేస్తామని తెలిపారు.

సంస్మరణ వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

- మావోయిస్టు కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్

మంచిర్యాల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను ఈ నెల 28 నుంచి ఆగస్టు 3 వరకు ఘనంగా నిర్వహించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. దేశంలో నక్సల్‌బరీ సాయుధ రైతాంగ తిరుగుబాటు నుంచి నేటి వరకు నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం ఐదు దశాబ్దాలుగా ప్రజాయుద్ధం కొనసా గుతోందని తెలిపారు. ఈ ఉద్యమంలో కీలక నాయకులు కామ్రేడ్‌లు చారుమజుందార్, కనాయ్ చటర్జీ అమరులయ్యారని పేర్కొన్నారు. వీరి నేతృత్వంలో విప్లవోద్యమం పురోగమిస్తూ పలువురు ప్రాణాలు అర్పించారని తెలిపారు. గత ఏడాది 194 మంది మావోయిస్టులు ప్రభుత్వ ప్రతిఘాతక చర్యలో అమరులయ్యారని తెలిపారు. మోదీ నాయకత్వంలోని బీజేపీ మేకిన్ ఇండియా, డిజిటల్ ఇండియా ప్రచారాలతో విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు నిబంధనలను సరళతరం చేసిందని విమర్శించారు. దేశ సంపదను దోచుకునేలా చట్టాలను సవరించిందని ఆరోపించారు. ఇక దశాబ్దాల పోరాటం తర్వాత సాధించిన తెలంగాణ రాష్ట్రంలో నేడు కనీస ప్రజాస్వామిక హక్కులు కూడా లేవని, నయవంచనకు గురి చేసిన బీఆర్ఎస్ పార్టీని ప్రజలు అధికారంలో నుంచి దించేసి, ఆరు గ్యారెంటీలు అని చెప్పిన కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చారని తెలిపారు. ఆరు నెలల్లోనే ప్రజా సమస్యలు, అవినీతి, అక్రమాలు, బ్రాహ్మణీయ హిందుత్వంపై పోరాడుతున్న వారిపై దాడులు చేస్తోందని విమర్శించారు. మావోయిస్టు పార్టీని నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఎన్‌కౌంటర్లు, అక్రమ కేసులతో అరెస్టులు చేస్తోందని తెలిపారు. ప్రతి బడ్జెట్‌లో రక్షణ, పోలీసు శాఖలకు విపరీత నిధులు కేటాయిస్తూ, ఆధునిక ఆయుధాలతో అణచివేత యాంత్రాలను తయారు చేస్తున్నారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ప్రతి మూడు కిలోమీటర్లకు ఒక పోలీసు క్యాంపును ఏర్పాటు చేసి, డ్రోన్లతో గ్రామాలపై బాంబులు వేస్తున్నారని విమర్శించారు. కుమరంభీం, మంచిర్యాల డివిజన్ కమిటీ సభ్యులు కామ్రేడ్‌లు వర్గేష్, మంగు, రాజు, బుర్రామ్ మార్చి 19న గడ్చిరోలి జిల్లాలో సీ60 కమాండో పోలీసుల చేతిలో అమరులయ్యారని, పిట్టపాడు వద్ద గ్రేహౌండ్స్ పోలీసుల కాల్పుల్లో సాగర్, మణిరాం, లక్మన్‌లు మృత్యువాత పడ్డారని తెలిపారు. ఏప్రిల్ 16న కల్పర్-అపటోల ఎన్‌కౌంటర్‌లో 29 మంది అమరులయ్యారని, ఏప్రిల్ 30న కాకుర్ ఎన్‌కౌంటర్‌లో జోగన్న, వినయ్ సహా 10 మంది మరణించారని తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

బెల్లంపల్లి, జూలై 26 : బెల్లంపల్లి పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని శుక్రవారం అరెస్టు చేసినట్లు బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ , బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపారు. పట్టణంలోని బాబుక్యాంపు బస్తీకి చెందిన సూర్యతేజ అతడి స్నేహితులైన ఇద్దరు మైనర్ బాలురు కలిసి మహారాష్ట్రలోని బల్లార్ష నుంచి గుర్తు తెలియని వ్యక్తి వద్ద 500 గ్రాముల గంజాయి కొనుగోలు చేసి బెల్లంపల్లికి తీసుకొచ్చారని చెప్పారు. ఇందులో 300 గ్రాముల గంజాయి అమ్మి వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నారు. ఈ నెల 25న మధ్యాహ్నం 3 గంటలకు కన్నాల బస్తీలోని వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద గంజాయి అమ్మడం కోసం ముగ్గురు కలిసి ఉండగా పోలీసు వాహనాన్ని చూసియువకులు పారిపోతుండగా పట్టుకున్నట్లు తెలిపారు.

గుంతలు పూడ్చివేత

బెల్లంపల్లి, జూలై 26: వర్షాలకు పట్టణంలోని రోడ్లపై గుంతలు ఏర్పడి వాహన దారులు ఇబ్బందులు పడుతున్న క్రమంలో శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కేల శ్వేత, కమిషనర్ వెంకటేశ్వర్లు గుంతలను పూడ్చివే యించారు. కాంటా చౌరస్తా, జీఎం కార్యాలయం చౌరస్తా వద్ద ఏర్పడిన గుంతలను డస్ట్ సిమెంటుతో పూడ్చి వేయించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గెల్లి రాజలింగు, ఎలిగేటి శ్రీను, మున్సిపల్ ఏఈ సందీప్, ఎస్ఐ రాజు, వైకుంఠం, ఆర్ఐ ప్రవీణ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ప్రత్యేకాధికారి

కాసిపేట, జూలై 26: మండలంలోని ముత్యంపల్లి, కాసిపేట జిల్లా పరిషత్ పాఠశాలలతో పాటు మోడల్ స్కూల్,రేగులగూడెం ఆశ్రమ పాఠశాలలను మండల ప్రత్యేకాధికారి గంగారాం పరిశీలించారు. ముత్యంపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేయగా అంగన్‌వాడీ టీచర్ హాజరు కాకపోవడంతో ఉన్నతాధికారులకు తెలియజేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో సప్దర్ ఆలీ, పంచాయతీ కార్యదర్శులు మేఘన, శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లాను మొదటి స్థానంలో నిలుపాలి

ఏసీసీ, జూలై 26: కేంద్ర ప్రభుత్వం నిర్వహించనున్న నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే 2024లో రాష్ట్రంలో మంచిర్యాల జిల్లాను మొదటి స్థానంలో నిలపాలని డీఈవో యాదయ్య అన్నారు. ప్రాథమిక పాఠశాలల సబ్జెక్టు డీఆర్‌పీలకు జిల్లా సైన్స్ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. డీఈవో మాట్లాడుతూ జిల్లా ముందు వరుసలో ఉండడానికి విద్యార్థులకు లక్ష్యాత్మకంగా బోధించడం ఒకటే మార్గమన్నారు. అందరు విద్యార్థులు అభ్యాసన ఫలితాలు సాధించేలా వ్యూహాత్మకంగా బోధించాలని సూచించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్‌లు చౌదరి శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి, డీఆర్‌పీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

హాజీపూర్: మండలంలోని దొనబండ, నరసింగపూర్ ప్రభుత్వ పాఠశాలలను శుక్రవారం డీఈవో యాదయ్య తనిఖీ చేశారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. విద్యార్థులను పాఠ్యాంశాలు ఎక్కడి వరకు బోధించారని అడిగి తెలుసుకున్నారు. అమ్మ ఆదర్శ కమిటీ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు హనుమాండ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విస్తరణ ఉపన్యాసం

మంచిర్యాల అర్బన్, జూలై 26: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ డాక్టర్ వంగ చక్రపాణి ఆధ్వర్యంలో ఉపన్యాస విస్తరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దర్మపురి ఎస్ఎల్ఎన్ ప్రాచ్య సం స్కృతాంధ్ర డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ కొరిడె విశ్వనాథ శర్మ ముఖ్య అతి థిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పట్వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో

కుమారుడిపై దాడిచేసిన తల్లిదండ్రులు

నెన్నెల, జూలై 26: మద్యం మత్తులో కన్న కుమారుడిపై హత్యాయత్నం చేసిన సంఘటన గురువారం రాత్రి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. నెన్నెల ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... బోయవాడకు చెందిన అబ్బర్ల పద్మ-విజయ్ దంపతులు మద్యానికి బానిస అయ్యారు. ప్రతి రోజూ తమ ఇద్దరు కుమారులతో గొడవ పడేవారు. ఇదే క్రమంలో గురువారం రాత్రి చిన్న కుమారుడు అశోక్‌తో గొడవ జరిగింది. దీంతో మద్యం మత్తులో ఉన్న తల్లిదండ్రులు అతన్ని చంపాలనుకున్నారు. చీకట్లో అశోక్ అనుకొని నిద్రిస్తున్న పెద్ద కుమారుడు శేఖర్ కాళ్లను తల్లి పట్టుకోగా, తండ్రి కొడవలితో కడుపుపై గాయపరిచాడు. అనంతరం ఇద్దరూ పారిపోయారు. శుక్రవారం ఉదయం రక్తపు మడుగులో స్పృహ కోల్పోయి పడి ఉన్న శేఖర్‌ను గమనించిన ఇరుగు పొరుగు వారు పోలీసులకు సమాచారం అందించారు. బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక

మంచిర్యాల అర్బన్, జూలై 26: మంచిర్యాల పట్టణ ఆటో యూనియన్ (రిజిస్ట్రేషన్ నెంబర్ 261/2021) నూతన కార్యవర్గాన్ని శుక్రవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు బెల్లంకొండ మురళి పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా రాజేష్, ముఖ్య సలహాదారులుగా నూనె భిక్షపతి, ఎండి రియాజ్, న్యాయ సలహాదారులుగా అడ్వకేట్ కేవి ప్రతాప్, అధ్యక్షుడిగా కలవల అంజయ్య, కార్యనిర్వాహణ అధ్యక్షుడిగా బోరే వెంకటేష్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా పి క్రాంతి, కోశాధికారిగా ఎండి శఫి, ఉపాధ్యక్షులుగా నాయిని వెంకటేష్, శ్రీనివాస్, హైమద్, సీహెచ్.రవి, కార్యదర్శులుగా ఎండి కలీం, ప్రభాకర్, సంయుక్త కార్యదర్శిగా కె.మల్లేష్, కార్యవర్గసభ్యులుగా నరేష్, ఖాదర్, కిరణ్, శంకర్, సతీష్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో 11 మెన్ కమిటీ సభ్యులు పొట్ట మధుకర్, చల్ల విక్రమ్, కట్ట రామ్‌కుమార్, ఆవుల సుధాకర్, మిర్యాల గట్టయ్య, మొయ్య రాంబాబు, నేరేళ్ల వెంకటేష్, తుమ్మల గోపాల్ రెడ్డి, ఎండి హబీబ్ బాబా, శ్రీనివాస్, ప్రకాష్, సతీష్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎడారిగా మారిన గోదావరి

జైపూర్, జూలై 26: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గోదావరి ఎడారిగా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామరావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పర్యటనలో భాగంగా శనివారం ఇందారం గోదావరి బ్రిడ్జి వద్ద గోదావరి నదిని పరి శీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో గోదావరి నిండుగా ఉండేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎడారిగా మారిందని విమర్శించారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

భీమారం, జూలై 26 : రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి భారీగా నిధులు కేటాయించడం, రైతు రుణమాఫీ సందర్భంగా శుక్రవారం మండలంలోని ఖాజీపల్లి గ్రామంలో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి చిత్రపటాలకు తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్ యాదవ్ క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ రైతు పక్షపాతి ప్రభుత్వమన్నారు. రుణమాఫీ చేయడంతో రైతులు ఆనందంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దేవుని శంకరయ్య, దాడి తిరుపతియాదవ్, దాడి భాస్కర్‌యాదవ్, సురేందర్ యాదవ్, రామయ్యయాదయ్, రాజయ్య, తిరుపతి, రాజేష్, సత్యనారాయణ, పోశం, రాజేశం, మల్లక్క, లక్ష్మీ తదతరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

బెల్లంపల్లి, జూలై 26: వర్షాల దృష్ట్యా వార్డుల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ ఛైర్‌పర్సన్ జక్కుల శ్వేత అన్నారు. పట్టణంలోని 13వ వార్డులో కౌన్సిలర్, టీపీసీసీ స్టేట్ ఓబీసీ వైస్ ఛైర్మన్ బండి ప్రభాకర్‌యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. బ్లీచింగ్ పౌడర్, దోమల నివారణ మందులను పిచికారీ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు..

విద్యారంగాన్ని విస్మరించిన ప్రభుత్వం

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 26: ప్రభుత్వంవిద్యారంగాన్ని విస్మరించిందని ఏబీవీపీ నాయకుడు అజయ్ ఆరోపించారు. విద్యార్థులు, నిరుద్యోగుల ఆశలు, ఆశయాలపైన నీళ్లు చల్లేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొర నిధులు కేటాయించడం సరికాదన్నారు.

విద్యారంగంపై చిన్నచూపు..

బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 7.31శాతం మాత్రమే నిధులు కేటాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఏఐఎస్ఎఫ్ నాయకులు సాగర్ తెలిపారు. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలకు కేవలం రూ.500 కోట్లు ఎలా సరిపెడతారని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాక ముందు ఇచ్చినమాట నిలబెట్టకోలేక పోతే బీఆర్ఎస్‌కు పట్టిన గతే పడు తుందన్నారు.

గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు

వాంకిడి, జూలై 26: మండలంలోని చిచ్చుపల్లి, కోలాంగూడ గ్రామాల్లో వైద్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీచేశారు. వర్షాకాలంలో దోమల వల్ల వచ్చేవ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది రియాజ్, గోదావరి తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహానికి మరమ్మతులు చేయించాలి

వాంకిడి, జూలై 26: సాంఘిక సంక్షేమ వసతిగృహానికి మరమ్మతులు చేపట్టాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దినకర్, దేవిక డిమాండ్ చేశారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో సంక్షేమ హాస్టల్స్, సూపరింటెండెంట్ మేనేజ్‌మెంట్ హాస్టల్, కేజీబీవీల్లో నెలకొన్న సమస్యలపై చేపట్టిన అధ్యయన యాత్రలో భాగంగా శుక్రవారం వాంకిడి సాంఘిక సంక్షేమ వసతిగృహాన్ని వారు సందర్శించారు.

మార్కెట్ కమిటీ ఛైర్మన్‌కు సన్మానం

బెజ్జూరు, జూలై 26: మండల కేంద్రంలోని వ్యవసాయ గోదాంను తనిఖీ చేయడానికి వచ్చిన మార్కెట్‌కమిటీ ఛైర్మన్ సిద్ధల దేవయ్యను శుక్రవారంను కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్ రాజారాం, శంకర్, బాబాజీ, హకీం, జావీద్, మార్కెట్ కమిటీ సిబ్బంది పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ చెక్ అందజేత

సిర్పూర్(టి), జూలై 26: మండలానికి చెందిన భీమయ్య రైలుప్రమాదంలో మృతిచెందడంతో శుక్రవారం బాధిత కుటుంబానికి రూ.20 లక్షల చెక్కును ఎస్బీఐ బ్యాంకు రీజనల్ మేనేజర్ గుప్తా అందజేశారు. భీమయ్య ఎస్బీఐ బ్యాంకులో వెయ్యి రూపాయల ప్రమాద బీమా చేసుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాద బీమాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ నూతన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

రామకృష్ణాపూర్, జూలై 26: రామకృష్ణాపూర్ పట్టణంలో శుక్రవారం రెండో ఎస్సై ఎన్ శ్రీనివాస్ సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే సైబర్ క్రైం టోల్ ఫ్రీ నం. 1930 కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సత్తయ్య, అంజయ్య, బ్లూకోల్ట్స్ సిబ్బంది, కానిస్టేబుల్ సునీల్, సమ్మయ్య, పాల్గొన్నారు.

ఘనంగా దారి మైసమ్మ బోనాలు



బోనంతో తరలివెళుతున్న మాజీ జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి

మందమర్రిటౌన్, జూలై 26 : పట్టణంలోని రామన్ కాలనీ రాజన్నల వాడ కోల్‌బెల్ట్ రోడ్డు పై ఓవర్ బ్రిడ్జి వద్ద శుక్రవారం దారి మైసమ్మ బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, ఆమె సతీమణి మాజీ జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి హాజరయ్యారు. దారి మైసమ్మ వద్ద పెట్టిన బోనాలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రాములు, శంకర్, చిన్న మొగిలి, మల్లేష్, రాజయ్య, సత్యనారాయణ, శంకర్,కృష్ణ, సారంగపాణి, రవి, వెంకటేష్ పాల్గొన్నారు.

మందమర్రి టౌన్: మందమర్రి ఏరియాలోని కేకే 5 గనిపై ఆఫీసు కార్యాలయ సిబ్బంది శుక్రవారం మైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంక్షేమాధికారి కార్తిక్, ఆఫీస్ సూపరింటెండెంట్ బుచ్చయ్య, అసిస్టెంట్ సూపరింటెండెంట్ సురేందర్‌రావు, సీనియర్ అసిస్టెంట్లు రాజశేఖర్, రాజుకుమార్, సురేష్, రాజేందర్‌తో పాటు గుర్తింపు సంఘం పిట్ కార్యదర్శి గాండ్ల సంపత్, తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

జైపూర్, జూలై 26: మండలంలోని దుబ్బపల్లి గ్రామానికి చెందిన జాడి హరీష్ (28) అప్పుల బాధ భరించలేక జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు రెండో ఎస్ఐ నాగరాజు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హరీష్ ట్రాక్టర్ నడుపుతూ జీవించేవాడు. ఏడాది క్రితం కొత్త ట్రాక్టర్‌ను ఫైనాన్స్ కింద కొనుగోలు చేశాడు. ట్రాక్టర్‌కు పనులు అంతగా రాకపోవడంతో ఫైనాన్స్ కిస్తులు కట్టలేక పోయాడు. ఇటీవల కాలంలో చెల్లెలు పెళ్లి కోసం రూ. 5 లక్షలు అప్పు చేశాడు. శ్రీరాంపూర్ ఓసీపీలో దుబ్బపల్లి పోతున్నందున నష్టపరిహారం వస్తే అప్పులు తీరుస్తానని అనుకోగా అది ఆల స్యమైంది. దీంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక జీవితంపై విరక్తి చెంది ఇంట్లోని వంటగదిలోకి వెళ్లి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. హరీష్‌కు ఇంకా వివాహం కాలేదు. హరీష్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నాలుగు నెలల వేతనాలు చెల్లించాలి

నస్పూర్, జూలై 26: జిల్లాలో ప్రీ మెట్రిక్ హాస్టల్స్ లో పని చేస్తున్న డేనైట్ వాచ్‌మెన్స్, కుక్స్, కామాటి, అవుట్ సోర్సిగ్ వర్కర్స్‌కు నాలుగు నెలలుగా వేతనాలను వెంటనే చెల్లించాలని శుక్రవారం షెడ్యూల్డ్ క్యాస్ట్ డిపార్టుమెంట్ డిప్యూటి డైరెక్టర్ రవీందర్ రెడ్డికి ఐఎఫ్‌టీయు ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి డి బ్రహ్మానందం, నాయకులు వెంకటేశ్, కిరణ్, సునిత, లత, ప్రమీల పాల్గొన్నారు.

ఛత్రపతి సాహూమహారాజ్‌కు ఘన నివాళి

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 26: జిల్లా కేంద్రంలో రిజర్వేషన్స్ డేను పురస్కరించుకుని సామాజిక సంఘాల నాయకులు ఛత్రపతి సాహూమహారాజ్ చిత్రపటానికి పూ లమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మోహన్, రాజేశం, సిద్దార్థ, రామ్మూర్తి, ఆశన్న, చందు, అభినవ్, శ్రీకాంత్, రంజిత్,ప్రకాష్, జయరాజ్, సరిత, సమ్మక్క, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేటరూరల్: ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కో కన్వీనర్ కొల్లూరి రవికుమార్ ఆధ్వర్యంలో వాగేశ్వర జూనియర్ కళాశాలలో ఛత్రపతి సాహూ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇంధల్ రాథోడ్, నవీన్‌కుమార్, విక్రమ్, కుమార్, ప్రశాంత్, వినయ్ పాల్గొన్నారు.

'బడ్జెట్ కేటాయింపులో బీసీలకు అన్యాయం'

మంచిర్యాల అర్బన్, జూలై 26: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్ కేటాయింపులో బీసీలకు అన్యాయం జరిగిందంటూ శుక్రవారం పట్టణంలోని ఐబీ చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కేంద్ర బడ్జెట్ మొత్తం రూ.42లక్షల కోట్లు కాగా బీసీలకు కేవలం రూ.3,300 కోట్లు మాత్రమే కేటాయించారని చెప్పారు. . రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీసీల కోసం రూ.9,200 కోట్లను కేటాయించిందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, రమేశ్, రాములు, భీంసేన్, చంద్రమౌళి, భిక్షపతి, రాజమల్లు, శ్రీనివాస్, రాజు, భీంరావు పాల్గొన్నారు.

సైనికుల త్యాగాలు మరువలేనివి

- కలెక్టర్ కుమార్ దీపక్

ఏసీసీ, జూలై 26: దేశ రక్షణే ఊపిరిగా తమప్రాణాలను పణంగా పెట్టి పోరాడుతున్న సైనికులు చేస్తున్న త్యాగం మరువలేనివని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కార్గిల్ విజయ్‌దివస్‌ను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరాస్తలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, సీఐ బన్సీలాల్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్గిల్ వీరులకు నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అక్రమంగా దేశంలోకి చొరబడిన వారితో ఆర్మీ అధికారులు సైనికులు వీరోచితంగా పోరాడి ప్రాణత్యాగం చేశారన్నారు. కార్గిల్ ఘటన ప్రతి భారతీయునిలో చెరగనిముద్ర వేసిందన్నారు. కార్గిల్ భూభాగంలోకి 1999 మే నెలలో ఉగ్రవాదులు చొరబడగా దాదాపు రెండున్నర నెలల పాటు అలుపెరుగని పోరాటం చేసి జులై 26, 1999న కార్గిల్‌విముక్తి కల్పించారన్నారు. ఈ పోరాటంలో ఎందరో ఆర్మీ అధికారులు, సైనికులు దేశం కోసం తమ ప్రాణాలను తృణ ప్రాయంగా త్యజించారన్నారు. వారి త్యాగాలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏసీసీ: జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ జెండాకు వందనం చేశారు. మాజీ సైనికులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు తూముల నరేష్, బ్లాక్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, చిట్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గల ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రంలో శుక్రవారం కార్గిల్ విజయ దివస్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో అమరులైన 527 మంది భారత సైనికులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రెటరీ చందూరి మహేందర్, కోశాధికారి కె సత్యపాల్‌రెడ్డి, కమిటీ సభ్యులు పవన్‌కుమార్ తివారి, కటుకం హరీష్ పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్: కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన సైనికుల త్యాగాలు చిరస్మరణీయమని మహాత్మాజ్యోతిబాపూలే పాఠశాల ప్రిన్సిపాల్ రజిత, ఏటీపీ అపర్ణశీల అన్నారు. కార్గిల్ వీరుల త్యాగాలను స్మరిస్తూ శుక్రవారం హైటెక్‌సిటీలోని పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. జెండాతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జన్నారం: జన్నారంలోని స్లేట్ హైస్కూల్‌లో శుక్రవారం కార్గిల్ దివస్‌ను నిర్వహించారు. జన్నారం మండలానికి చెందిన ఆర్మీ జవాన్ మజహర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో స్లేట్ గ్రూపు చైర్మన్ ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ షరీన్, డైరెక్టర్ రజితరెడ్డి పాల్గొన్నారు.



మంచిర్యాలలో కార్గిల్ అమరులకు నివాళులు అర్పిస్తున్న అధికారులు

దళారుల నుంచి ఆదివాసీలను కాపాడాలి

కాసిపేట, జూలై 26: దేవాపూర్ యూనియన్ బ్యాంకులో దళారులు ఆదివాసీలను మోసం చేస్తూ డబ్బులను దండుకుంటున్నారని, అధికారులు కాపాడాలని శుక్రవారం దేవాపూర్ యూనియన్ బ్యాంకు మేనేజర్‌కు ఆదివాసీ సంఘాల నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ హక్కుల పోరాట సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెంద్రం హన్మంతు మాట్లాడుతూ కొందరు దళారులు పంట రుణాల పేరుతో పట్టా పాస్ బుక్కులు తీసుకుని మోసాలకు పాల్పడుతున్నా రన్నారు. వీరి నుంచి ఆదివాసీలను కాపాడాలన్నారు. బ్యాంకు అధికారులు కూడా నేరుగా పంట రుణాలను రైతులకు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెడ్మ కిషన్, ఆత్రం జంగు , సంద్ర భూమయ్య, రాందాస్, రాజేశ్వర్, ప్రభాకర్, లాల్ బహదూర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు కేటాయించాలి

బెల్లంపల్లి(తాండూర్), జూలై 26: తాండూర్ మండలంలో ప్రభుత్వ స్థలాలను కేటాయించాలని శుక్రవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు కాంగ్రెస్ నాయకులు సల్వాజీ మహేందర్‌రావు, గట్టు మురళీధర్‌రావు, సూరం రవీందర్‌రెడ్డి, పేరం శ్రీనివా స్‌లు ఎమ్మెల్యే నివాసంలో వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ జూనియర్ కళాశాల గతంలో మంజూరైనా అది కో ఎడ్యుకేషన్ కాకుండా బాలికల జూనియర్ కళా శాల మంజూరైందని, దాన్ని రద్దు చేసి కో ఎడ్యుకేషన్ మంజూరయ్యేలా చూడాలన్నారు. అలాగే మహాత్మాజ్యోతి బాపూలే బాలుర పాఠశాలకు స్థలం కేటాయించాలని కోరారు. తాండూర్ ఐబీ చౌరస్తాలో సులభ్ కాంప్లెక్స్ లేక ప్రయాణికులు, స్థానిక వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం మస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

బురద రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

కోటపల్లి, జూలై 26: మండలంలోని పారుపెల్లి ఎస్సీ కాలనీలోని బురద రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు. కాలనీలో ఉండే ప్రాథమిక పాఠశాలకు విద్యార్థులు వెళ్లాలంటే మోకాలిలోతు బురదలో ఇబ్బందులు పడుతూ పాఠశాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని చెప్పారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

● సంక్షిప్తం..

- జన్నారం: ఇందన్‌పల్లి రేంజ్ పరిధిలోని వాగు వద్ద నీటి ప్రవాహంలో నక్క శుక్రవారం చిక్కుకుపోవడంతో ఎఫ్ఎ స్‌వో కృష్ణరావు, బీట్ అధికారి రాజేశ్వర్ బేస్ క్యాంపు సిబ్బంది సహాయంతో కాపాడి అడవిలో వదిలిపెట్టారు.
- బెల్లంపల్లి: బెల్లంపల్లి టౌన్ ఎస్ఐగా మహేందర్ శుక్ర వారం బాధ్యతలు స్వీకరించారు.
- బెల్లంపల్లి(తాండూర్): తాండూర్ ఎస్ఐగా కిరణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు.
- వేమనపల్లి: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మండల ప్రత్యేకాధికారి ఉదయ్‌కుమార్ తనిఖీ చేశారు.
- హాజీపూర్: ముల్కల్లలో ఎంపీడీవో మధుసూదన్ ఇం టింటికీ ఆరు మొక్కలను పంపిణీ చేశారు.
- శ్రీరాంపూర్: వాహనానికి నంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ ఎం సంతోష్ తెలిపారు.

బీమాతో రైతుకు ధీమా

- దరఖాస్తులకు 5వ తేదీ తుది గడువు

- అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

కాసిపేట, జూలై 26: భూమిని నమ్ముకుని వ్యవసాయం చేస్తున్న రైతుకు బీమా ఎంతో ధీమాను ఇస్తుంది. కష్టించి పనిచేసే అన్నదాత అకాల మరణం పొందితే ఆ కుటుంబం రోడ్డు పాలవుతుంది. యాజమానిని కోల్పోయిన కుటుంబానికి భరోసా కల్పించి ఆర్థికంగా ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు బీమా పథకాన్ని 2018 ఆగస్టు 15న ప్రారంభించింది. దీంతో బీమా చేయించుకున్న రైతు కుటుంబానికి ప్రభుత్వం రూ. 5 లక్షలు ఇచ్చిఆదుకుంటుంది. అర్హులైన రైతులందరు రైతు బీమాను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. రైతు పట్టా పాస్‌బుక్, ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డులతో దరఖాస్తు చేసుకుంటే రూ. 3,457 ప్రీమియాన్ని రైతు పేరిట ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఈ యేడాది జూన్ 28లోపు కొత్త పట్టా పాస్‌బుక్‌లు పొందిన రైతులతో పాటు గతంలో రైతు బీమా చేయించుకోని రైతులందరు ఆగస్టు 5లోపు దరఖాస్తులు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అలాగే గతంలో బీమా చేయించుకుని ఆధార్ లేదా నామిని చనిపోతే మార్పులు చేర్పులను ఈ నెల 30లోగా సరి చేసుకునేందుకు మరో అవకాశం కల్పించింది.

● జిల్లా వ్యాప్తంగా..

మంచిర్యాల జిల్లాలో 1,60,880 మంది రైతులు ఉన్నారు. 95,884 మంది రైతులు బీమా పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. కాగా 80,193 మంది రైతు బీమాకు అర్హత సాధించారు. 15,691 మంది రైతుల వివరాలు సాంకేతిక కారణాలతో వెయిటింగ్‌లో ఉన్నాయి. ఇంకా 18,180 మంది రైతులు రైతు బీమాకు దరఖాస్తులు చేసుకోలేదు.

రైతు బీమా కలిగి ఉండాలి..

జిల్లాలో అర్హులైన ప్రతీ రైతు కూడా బీమా కలిగి ఉండాలి. రైతు అకాల మరణం సంభవిస్తే కుటుంబం తీవ్ర ఇబ్బందుల పాలవుతుంది. ప్రభుత్వం బాధిత రైతు కుటుంబాలను ఆదుకోవ డానికి రైతు బీమా పథకం ప్రవేశపెట్టింది. రైతు కుటుంబానికి రూ. 5 లక్షల ఆర్థిక భరోసాను కల్పిస్తుంది. సందేహాలు ఉంటే మండల వ్యవసాయాధికారులను సంప్రదించాలి.

- కల్పన, జిల్లా వ్యవసాయాధికారి



వ్యవసాయ శాఖ అధికారులు క్లస్టర్ల వారీగా గుర్తించి సభ్యత్వ నమోదు చేయించాలి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 390 మంది రైతులు వివిధ కారణాలతో మృతిచెందగా 331 మంది రైతులకు రూ. 16.55 కోట్లను రైతు కుటుంబాలకు ప్రభుత్వం అందజేసింది. 59 మంది రైతు కుటుంబాలకు బీమా రావాల్సి ఉంది. కాగా రైతు బీమాకు 18 నుంచి 59 ఏళ్లలోపు ఉన్న వారు అంటే 14 ఆగస్టు 1965 నుంచి 14 ఆగస్టు 2006 మధ్య జన్మించిన వారు అ ర్హులు. భూమి ఏ ప్రాంతంలో ఉన్నా దరఖాస్తు ఒకే చోట చేసుకోవాలి. రైతు పట్టా పాస్‌బుక్ లేదా తహసీల్దార్ సంతకం చేసిన డీఎస్ పేపరు, రైతు ఆధార్‌కార్డు,నామిని ఆధార్‌కార్డు జిరాక్స్‌లను క్లస్టర్ కార్యాలయంలోని ఏఈవోకు అందజేయాలి. దీంతో దరఖాస్తు ప్రక్రియ పూర్తవుతుంది. వివరాలకు రైతులు స్థానిక వ్యవసాయాధికారులను సంప్రదిస్తే సూచనలు చేస్తారు.

మండలకేంద్రంలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి

లింగాపూర్, జూలై 26: మండలకేంద్రంలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని మాజీ వైస్ఎంపీపీ జాదవ్ గనపత్‌నాయక్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలకేంద్రంలో విద్యుత్‌దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వర్షాకాలం గ్రామంలో దీపాలులేక రాత్రి చీకటిలో పాములతో ప్రజలు భయపడుతు న్నారని అన్నారు. ప్రత్యేకాధికారులు ఒక్కసారైనా గ్రామాన్ని సందర్శించడం లేదన్నారు. వర్షాకాలం వ్యాధుల నేపథ్యంలో మందు జాగ్రతగా దోమల మందు పిచికారి చేయించాలన్నారు. అధికారులు స్పందించి వెంటనే గ్రామపంచాయతీలో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరించా లన్నారు.

అదుపు తప్పితే అంతే సంగతులు



ప్రమాదకరంగా మారిన వంతెన

కాగజ్‌నగర్, జూలై 26: కాగజ్‌నగర్ మెరాజ్‌నగర్ సమీపంలోని వంతెన ప్రమాదకరంగా తయారైంది. వర్షాలకు పూర్తిగా బురదమయంగా మారింది. కనీసం నడిచేందుకు కూడా వీలులేకుండా ఉంది. ద్విచక్ర వాహనాలు వెళ్లాలంటే కూడా భయంగా ఉంది. ఏమాత్రం అదుపు తప్పినా బురద లోపడి పోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి వంతెనపై ఉన్న గుంతలను పూడ్చాలని కాలనీవాసులు డిమాండు చేస్తున్నారు.

గోడ కూలి వృద్ధురాలి మృతి

కాగజ్‌నగర్, జూలై 26: కాగజ్‌నగర్ గంగారం బస్తీలో వర్షాలకు ఇంటిగోడ కూలి కొమురమ్మ(58) అనే మహిళ మృతిచెందినట్టు ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గంగారం బస్తీలో నివాసం ఉంటున్న కొమురమ్మ తాగునీరు తెచ్చుకున్న క్రమంలో ఒక్కసారిగా గోడ కూలి కొమురమ్మపై పడింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందినట్టు ఎస్సై తెలిపారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి



ధర్నా చేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు

కాగజ్‌నగర్, జూలై 26: కాగజ్‌నగర్ రాజీవ్ గాంధీ చౌరాస్తాలో మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని శుక్రవారం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ పెండింగ్ బకాయిలు ఇంతవరకు చెల్లంచటం లేదన్నారు. పీఎఫ్, ఇఎస్ఐ డబ్బులు కట్టడం లేదన్నారు. అలాగే జీతాలు కూడా ఇవ్వటం లేదన్నారు. ధర్నాలో సీఐటీయూ నాయకులు ముంజం ఆనంద్ కుమార్, జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణమాచారి, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

'రిటైర్‌మెంటు బెనిఫిట్స్ ఇవ్వాలి'

రెబ్బెన, జూలై 26: సమగ్రశిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల్లో 61సంవత్సరాలు నిండి తొలగించిన వారికి ప్రభుత్వం వెంటనే రిటైర్‌మెంటు బెనిఫిట్స్ ఇవ్వాలని సమగ్రశిక్ష మండల అధ్యక్షుడు వేముల సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానికంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ తొలగించిన వారందరికీ నెలకు రూ.10వేల పెన్షన్ ఇచ్చేట్టు చూడాలన్నారు. కార్యక్రమంలో మండల సీఆర్పీలు ఎం దేవేందర్, ఎం రాజేష్, మహేశ్వర్, శేఖర్, పి రామయ్య, గడ్డం లక్ష్మి తదితరులున్నారు.

'విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు ఇవ్వాలి'

రెబ్బెన, జూలై 26: సింగరేణి జడ్పీ పాఠశాలలోని విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయాలని శనివారం కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు రెబ్బెన మండల యూత్ కాంగ్రెస్‌పార్టీ ఉపాధ్యక్షుడు సాయి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోలేటిలో జడ్పీపాఠశాల లేనందున నిరుపేద విద్యార్థులంతా సింగరేణి పాఠశాలలో చదువుతున్నట్టు తెలిపారు. కాంట్రాక్టు కార్మికులు, రైతుకూలీలు, డ్రైవర్ పిల్లలుందరికీ ఉచితంగా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయాలని కోరారు.

జలదిగ్బంధంలోనే మగ్గుతున్నగ్రామాలు



బెజ్జూరులో ముంపు గ్రామాలకు కూరగాయలు తరలిస్తున్న ఎస్సై విక్రం

బెజ్జూరు, జూలై 26: ప్రాణహిత నదికి వరద ఉధృతి కొనసాగుతోంది. తలాయి-పాపన్నపేట, కుశ్నపల్లి- సోమిని గ్రామాల మధ్య ప్రాణహిత బ్యాక్‌వాటర్, లోలెవల్ వంతెనలపై వరదనీరు ప్రవహిస్తుండడంతో 12 గ్రామాలకు రాకపోకలు పూర్తిగా స్తంభించి పోయాయి. వాగులు, వంకలు పొంగడంతో ఆయాగ్రామాల ప్రజలకు పూర్తిగా బాహ్యప్రపంచంతో సంబం ధాలు తెగిపోయాయి. వాగు అవతల ఉన్న సుస్మీర్, సోమిని, ఇప్పలగూడ, మొగవెల్లి, బండలగూడ, నాగెపల్లి, పాత సోమిని, గెర్రెగూడ, తలాయి, తిక్కపల్లి, భీమారం తదితర గ్రామాల ప్రజలు వారం రోజుల నుంచి వరదలతో బయటకు రాలేని పరిస్థితులు నెలకొన్నాయి. అంతే కాకుండా వారంరోజుల నుంచి పత్తి పంట పూర్తిగా నీటమునిగి తీవ్రంగా నష్టపోయారు. ఆయాగ్రామాల ప్రజలు ప్రాణహితవరద నీటలో ప్రమాదపు టంచున నాటుపడవలపై ప్రయాణం చేస్తూ మండలకేంద్రానికి వచ్చి వెళ్తున్నారు. వరదల కారణంగా ప్రజలు బయటకు రాలేని పరిస్థితులు ఉండడంతో శుక్రవారం బెజ్జూరు ఎస్సై విక్రం సుమారు వందకుటుంబాలకు కూరగాయలు అందజే తన ఔదార్యాన్ని చాటుకున్నారు.

మా గ్రామాన్ని పట్టించుకోండి..

- దిందా గ్రామస్థుల ఆవేదన

చింతలమానేపల్లి: గ్రామాన్ని ప్రభుత్వం, ఉన్నతాధికారులు పట్టించుకోవాలని దిందా గ్రామస్థులు వేడ్కొంటున్నారు. వర్షాల కారణంగా ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగును గ్రామస్థులు శుక్రవారం పరిశీలించారు. పదిహేను రోజులుగా బాహ్య ప్రపంచానికి దూరంగా జలదిగ్బంధంలో ఉన్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం తమకు నిత్యావసర సరుకులు తెచ్చుకునే పరిస్థితి లేదంటున్నారు. అత్యవసర పరిస్థితు లేర్పడితే దేవుడే దిక్కని ఆవేదన చెందుతున్నారు. గ్రామానికి అటువైపుగా ప్రాణహితనది, ఇటువైపుగా వాగు ఉండడంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని కాలం వెళ్లదీస్తున్నామని పేర్కొంటున్నారు. ప్రతి ఏడాది వర్షాకాలంలో ఇదే పరిస్థితి అంటున్నారు. పిల్లలు చదువులకు దూరమవుతున్నారని అన్నారు. ఉన్నతాధికారులు, ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి వాగుపై వంతెన నిర్మించి కష్టాలు తొలగించా లని కోరుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సిర్పూర్(టి): ఇక్కడ కురుస్తున్న వర్షాలకు, ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు పెన్‌గంగాలో వరద ఉధృతి పెరుగుతోంది. దీంతో లోతట్టుప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్‌శ్రీనివాస్ అన్నారు. గురువారం రాత్రి వరదఉధృతిని ఆయన పరిశీలించి ఎవరూకూడా వాగుదాటకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని, వాగుదాటే ప్రయత్నాలు చేయరాదన్నారు. అత్యవసర సమయంలో టోల్‌ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందిస్తే సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

ప్రాణహిత బ్యాక్‌వాటర్‌లో మునిగిన పంటలు

దహెగాం: ప్రాణహిత ప్రాణహిత బ్యాక్ వాటర్‌తో పంటలు నీటమునిగాయి. శుక్రవారం మండలంలోని రాంపూర్, మొట్లగూడ, టేపర్‌గాం, దిగిడ, దుబ్బగూడ, రావుపల్లి గ్రామాల్లో పత్తి, కంది, తదితర పంటలు నీట మునిగినట్లు రైతులు తెలిపారు. ప్రభుత్వం, అధికారులు సర్వే చేపట్టి పరిహారం ఇచ్చి ఆదుకోవాలని ఆయాగ్రామాల రైతులు కోరుతున్నారు.

పెంచికలపేట: మండల వ్యాప్తంగా శుక్రవారం తేలికపాటి వర్షం కురిసింది. ప్రాణహిత నది ఉధృతంగా ప్రవహించడంతో మురళీగూడ, జిల్లెడ గ్రామాల పంటచేనులు నీటమునిగాయి. నంది గ్రామానికి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

కూలిన ఇంటి గోడ

కౌటాల: మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామానికి చెందిన వృద్ధురాలు జనాబాయి ఇంటిగోడ శుక్రవారం కూలిపోయింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోడ తడిసి కూలిపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కాగా వృద్ధురాలి భర్త కొన్ని సంవత్సరాల క్రితం మృతిచెందగా పిల్లలు ఎవరు లేరు. ఇంట్లో ఒక్కతే ఉంటుంది. కౌటాల ఎస్సై మదుకర్ స్పందించి బాధితురాలికి రూ.3వేల నగదు, 25కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.



దహెగాం మండలం మొట్లగూడలో నీట మునిగిన పంటలు



కౌటాల మండలం మొగడ్‌దగడ్‌లో కూలిన ఇంటి గోడ

'జీవన'వ్యాపారం



బొమ్మలు అమ్ముకుంటున్న రాజస్థానీ మహిళ

పెంచికలపేట, జూలై 26: కూటి కోసం కోటి తిప్పలు.. బతకడానికి ఎంత దూరమైన వెళ్లాల్సి వస్తుంది. అందుకు ఉదాహరణే ఈ చిత్రం. మండల కేంద్రంలో శుక్రవారం ఓ వృద్ధురాలు తన మనవరాలితో కలిసి బొమ్మలు అమ్ముకుంటూ తిరుగుతున్న క్రమంలో 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కింది. ఆవృద్ధురాలిని పలుకరించగా రాజస్థాన్ నుంచి ఇక్కడికి వచ్చినట్లు తెలిపింది. శుక్రవారం వారసంత ఉండడంతో వ్యాపారం గిట్టుబాటు అవుతుందని ఇక్కడికి వచ్చినట్లు తెలిపింది.

కష్టాల చదువులు



వాగు దాటుతున్న విద్యార్థులు

పెంచికలపేట, జూలై 26: మండలంలోని జైహింద్‌పూర్, జిల్లెడ ప్రాథమికపాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఈ పాఠశాలకు సమీపంలోని ఒర్రెఉధృతంగా ప్రవహి స్తోంది. అధికారులు స్పందించి వంతెన ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతు న్నారు.

ప్రకృతి ఒడిలో కల్లెగాం జలపాతం



జాలువారుతున్న కల్లెగాం జలపాతం

కెరమెరి, జూలై 26: మండలంలోని కల్లె గ్రామం సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో కనువిందు చేస్తోంది కల్లెగాం అందాల జలపాతం. 20 రోజులుగా కురుస్తున్న వర్షాలకు దట్టమైన అడవిలో జలపాతం పారుతోంది. తెల్లని పాలు కొండపై నుంచి నేలపై పడుతున్న విధంగా నీరు ఎత్తైన కొండనుంచి నేలపై పడుతున్నాయి. ఆసిఫాబాద్, కెరమెరి ప్రాంతాల నుంచి ఈ జలపాతాన్ని వీక్షించేందుకు ప్రకృతి ప్రేమికులు వస్తున్నారు.



పాతకాలంలో.. ఇంట్లో డబ్బులు ఉంటే దొంగలు ఎత్తుకుపోతారు.. బ్యాంకుల్లో అయితే భద్రం అని చెప్పేవారు. దీంతో ప్రజలు బ్యాంకులను నమ్మి అందులోనే పొదుపు చేస్తున్నారు. కానీ ఇప్పుడు ఆ బ్యాంకులో డబ్బులు ఉండడమే శాపంగా మారింది. బ్యాంకు ఖాతాలో లక్ష అంతకంటే ఎక్కువ ఉంటే ఆ విషయాన్ని తెలుసుకుని సైబర్ నేరగాళ్లు దోచేస్తున్నారు. స్మార్ట్‌ఫోన్‌తో ఎంత మేలు జరుగుతుందో.. అంత నష్టం కూడా జరుగుతోంది... కాబట్టి తస్మాత్ జాగ్రత్త..

- వీదేశి యాప్‌ల పేరిట మోసాలు
- పెట్టుబడుల స్వీకరణ వరకే క్లియరెన్స్
- విత్‌డ్రా ఆప్షన్ తీసేస్తున్న నిర్వాహకులు
- నిలువెల్లా మోసపోతున్న పెట్టుబడిదారులు
- జిల్లాలో పెరిగిపోతున్న బాధితులు



జాగ్రత్తలు..

- వీలైనంత వరకు తెలియని వ్యక్తులకు ఫోన్ నంబరు ఇవ్వకూడదు.
- తెలియని నంబరు నుంచి వచ్చిన మెస్సేజ్‌లకు, లింకులకు స్పందించకూడదు.
- తెలియని నంబరు నుంచి వచ్చే ఫోన్ సంభాషణలకు వివరాలు తెలుపకూడదు.
- ముఖ్యంగా ఓటీపీ, పాస్‌వర్డ్, ఏటీఎం పిన్ నంబరు ఎవరికీ చెప్పకూడదు.
- ఫోన్‌లో సైబర్ క్రైమ్ ఎమర్జెన్సీ నంబరు 1930ను ఫోన్‌లో ఫీడ్ చేసుకోవాలి.



తస్మార్ట్ జాగ్రత్త

కాగజ్‌నగర్, జూలై 26: సైబర్ నేరగాళ్లు రోజుకోక కొత్త మోసానికి తెరలేపుతున్నారు. ఇన్నాళ్లు బ్యాంకు ఏటీఎం పిన్ నంబరు మార్చాలని.., కొత్త పాస్ బుక్ కోసమని.. మోసం చేసిన సంఘటలు చూశాం. కానీ ఇప్పుడు ఏకంగా వీదేశాలకు చెందిన నకిలీ ఫైనాన్షియల్ యాప్‌ల లింక్‌లు సెల్‌ఫోన్‌కు పంపిస్తున్నారు. వాటిని క్లిక్ చేయగానే ఫోన్‌లో ఆప్ ఇన్‌స్టాల్ అవుతుంది. అందులో పెట్టుబడి పెడితే లాభం వస్తుందని ఆశచూపి ప్రజలను మోసం చేస్తున్నారు. ఈ ఉచ్చులో పడిన వారు నిలువెల్లా మోసపోతున్నారు.

జిల్లాలో ఆసిఫాబాద్, సిర్పూరు నియోజకవర్గాల నుంచి చాలామంది పెట్టుబడులు పెట్టి మోసపోయారు. పెట్టుబడులు పెడితే ఒక్కరోజులోనే రెట్టింపు డబ్బులు వస్తాయని రోబోటిక్స్, ఏఐ ఇంటిలిజెన్స్, డేటాప్రొడక్ట్స్ పేరిట నకిలీ యాప్‌ల యాడ్‌లు ఆన్‌లైన్‌లో కన్పిస్తున్నాయి. ఈ సైట్‌లను క్లిక్‌చేస్తే సంబంధిత యాప్ నుంచి కస్టమర్ కేర్ అంటూ మాటల్లో పెట్టేసి ఒక్కరోజుల్లో డబ్బులు రెట్టింపు వస్తుందని ఆశ చూపుతున్నారు. ఒక్కరోజులోనే రెండింతలువస్తున్నాయని అంటూ అప్పులు చేసి మరీ ఈ యాప్‌ల్లో పెట్టుబడులు పెట్టగానే సంబంధిత సెల్ ఫోన్లన్నీ స్విచ్ ఆఫ్ రావటం, విత్ డ్రా ఆప్షన్ లేక పోవడం, యాప్‌ను నిర్వాహకులు ఆన్‌లైన్ నుంచి క్షణాల్లో తీసేస్తుంటడంతో మోసపోయిన వారంతా లబోదిబోమంటున్నారు.

ఈ తరహా దందా జిల్లాలో అధికంగా సాగుతోంది. ఒకరికి తెలియకుండా మరొకరు పెట్టుబడులు పెడుతూ నిలువెల్లా మోసపోతున్నారు. పెట్టుబడులు పెట్టిన తర్వాత విత్ డ్రా ఆప్షన్ తీసేయటం, కస్టమర్ కేర్ నంబర్ల నుంచి ఫోన్లు ఎత్తక పోవటం, ఐపీ అడ్రసులన్నీ కూడా పొంతన లేకుండా ఉన్నట్టు బాధితులు పేర్కొంటు న్నారు. తాము నష్టపోయినట్టు తెలిస్తే పరువు పోతుందని బయటికి ఎవరూ చెప్పడం లేదు. కాగా, ఈ ఫేక్ యాప్‌లన్నీ కూడా ప్రాక్సీ బ్రౌజర్స్ ద్వారా ఆన్‌లైన్‌లో పొందుపరుస్తుండటంతో ఐపీ అడ్రసు కనిపెట్టలేకపోతున్నట్టు నిపుణులు పేర్కొంటున్నారు.

అప్రమత్తంగా ఉండాలి..

సెల్‌ఫోన్ వాడుతున్న వారంతా అప్రమత్తంగా ఉండాలని సైబర్ నిపుణులు పేర్కొంటున్నారు. వారం రోజుల క్రితం కూడా పీఎం కిసాన్‌పేరిట సాఫ్ట్‌వేర్స్ అన్ని మొబైల్స్‌కు సైబర్ నేరగాళ్లు పంపించారు. ఈ సాఫ్ట్‌వేర్‌ను క్లిక్ చేస్తే సెల్ ఫోన్‌లో ఆటోమెటిక్‌గా డౌన్‌లోడ్ అవుతుంది. అనంతరం మనసెల్ ఫోన్ హ్యాకర్ చేతిలోకి పోతుంది. అందులోని మన బంధువులు, స్నేహితుల సెల్‌ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి ఆరోగ్యం బాగాలేదని, తాను ఆసుపత్రిలో ఉన్నానని వెంటనే డబ్బులు పంపించాలని మోసాలు చేస్తున్నారు. బంధువులు నమ్మి డబ్బులు ఎకౌంట్లో వేసేసిన తర్వాత వాకబు చేస్తే తాను డబ్బులు అడుగలేదని చెప్పటంతో మోసపోయినట్టు లబోదిబోమంటున్నారు.

సమాజంలో ఉండే పెద్దవ్యక్తులు కూడా హ్యాకర్ల చేతిలో ఇరికిపోతున్నారు. పోతే డబ్బులు పోనీ అందరికీ తెలియటం, కేసులు చిక్కులు ఎందుకని పక్కన పెట్టేస్తున్నారు. ఆన్‌లైన్ సైట్‌లో నకిలీ యాప్‌లు రకరకాలు వస్తున్నాయి. పొరపాటున క్లిక్‌చేస్తే వెంటనే కస్టమర్ కేర్ నుంచి ఫోన్లు వస్తున్నాయి. ఈ ఫోన్లలో కూడా మీ కుటుంబ సభ్యుల గురించి వాకబు చేసి ఇందులో పెట్టుబడులు పెట్టాలని మీకు లాభం వస్తుందని నమ్మిస్తున్నారు. ఇటువంటివి నమ్మి పెట్టుబడులు పెట్టవద్దని నిపుణులు సూచిస్తున్నారు.

ఇంతవరకు ఫిర్యాదులు రాలేదు..

కరుణాకర్, డీఎస్పీ కాగజ్‌నగర్

వీదేశీ యాప్‌ల పేరిట మోసాలు జరుగుతున్న సంఘటనపై ఇంతవరకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. ఫిర్యాదులు వస్తే తప్పకుండా విచారణ జరుపుతాం. అలాగే సైబర్‌క్రైం వారికి దృష్టికి తీసుకెళ్లుతాం. ఆన్‌లైన్ మోసాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

ట్రాన్స్‌జెండర్లకు ఆర్థిక పునరావాస పథకం



ట్రాన్స్‌జెండర్‌కు కార్డులను అందజేస్తున్న కలెక్టర్

ఆసిఫాబాద్, జూలై 26: ట్రాన్స్‌జెండర్ల సంక్షేమంకోసం ఆర్థిక పునరావాస పథకం అమలు చేస్తామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా సంక్షేమశాఖాధికారి భాస్కర్‌తో కలిసి ఇద్దరు ట్రాన్స్‌జెండర్లకు 2022-23సంవత్సర ఆర్థిక పునరావాస పథకం కింద చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం కోసం అర్హతగల వారికి గుర్తింపు కార్డులు అందిస్తామన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్థిక పునరావాస పథకం కింద జిల్లాలోని ఇద్దరు ట్రాన్స్‌జెండర్లకు ఒక్కొక్కరికి రూ.50వేలచొప్పున చెక్కులు అందజేశామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్‌రెస్పాన్స్ అధికారి రవికుమార్, ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు.

ఎన్ఏఎస్‌లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో అశోక్

ఆసిఫాబాద్ రూరల్, జూలై 26: నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(ఎన్ఏఎస్)లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభకనబర్చాలని డీఈవో అశోక్ అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులందరూ కనీసఅభ్యసన సామర్థ్యాలు సాధించేలా ప్రతిఉపాధ్యాయుడు విద్యాబోధన చేయాలన్నారు. నవంబర్‌లో నిర్వహించే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపాలన్నారు. దానికి ప్రతి ఉపాధ్యాయుడు కృషిచేయాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో మానిటరింగ్ అధికారి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు సుభాష్, ఆర్పీలు పాల్గొన్నారు.

ఒలింపిక్ క్రీడాకారులకు విద్యార్థుల శుభాకాంక్షలు



జాతీయ జెండాలు చేత పట్టుకుని విషెస్ చెబుతున్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 26: పారీస్‌లో జరుగనున్న ఒలంపిక్‌కి భారత దేశం నుంచి 117మంది క్రీడాకారులు పాల్గొనున్నారు. వీరికి మద్దతుగా శుక్రవారం ఆసిఫాబాద్ పట్టణంలోని గిరిజనక్రీడాపాఠశాల విద్యార్థులు ఇండియన్ ఫ్లాగ్స్‌తో చీర్ ఫర్ ఇండియా నినాదంతో ఆల్‌దిబెస్ట్ విషెస్ చెప్పి క్రీడాస్ఫూర్తిని చాటారు. కార్యక్రమంలో డీడీ రమాదేవి మాట్లాడుతూ గిరిజన క్రీడాపాఠశాల విద్యార్థులు కూడా ఒలంపిక్‌లో పాల్గొని సత్తాచాటాలని అన్నారు. కార్యక్రమంలో ఏసీఎంఓ ఉద్దవ్, ఏటీడీవో క్షేత్రయ్య, జీసీడీవో శకుంతల, క్రీడల అధికారి మీనారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, కోచ్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

ట్రైబల్ డిక్లరేషన్ అమలు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్, జూలై 26: ట్రైబల్ డిక్లరేషన్ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో, చేవెళ్ల బహిరంగ సభలో ప్రకటించిన విధంగా ఎస్టీ ట్రైబల్ డిక్లరేషన్‌ను అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా హామీని అమలు చేయడం లేదని ఆరోపించారు. కార్యక్ర మంలో బీజేపీ నాయకులు కోవ విజయ్, కోట్నాక విజయ్, సుభాష్, రాంషావ్, మారుతి, శ్రావణ్‌గౌడ్, తుకారాం, పెంటు, శంకర్, హనుమంతు, ప్రకాష్, భీంరావు, విరాట్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'గంజాయి, డ్రగ్స్ నిర్మూలించడానికి యువత ముందుకు రావాలి'

ఆసిఫాబాద్, జూలై 26: గంజాయి, డ్రగ్స్ నిర్మూలించడానికి యువత ముందుకు రావాలని సీఐ సతీష్ అన్నారు. శుక్రవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన మాదకద్రవ్యాలను అరికడుదాం-సమాజాన్ని కాపాడు దాం-యువతను చైతన్యపర్చుదామని చేపడుతున్న అవగాహన సదస్సు పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను మత్తులో ముంచి చిత్తుచేసే గంజాయి, డ్రగ్స్ వినియోగానికి అడ్డుకట్ట వేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై రాజేశ్వర్, ప్రవీణ్‌కుమార్, డీవైఎఫ్ఐ నాయకులు టీకానంద్, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టును సందర్శించిన ట్రైనీ అటవీ సిబ్బంది



చెక్‌పోస్టును సందర్శిస్తున్న అటవీశాఖ ట్రైనీసిబ్బంది

వాంకిడి, జూలై 26: తెలంగాణ ఫారెస్ట్‌అకాడమీ దూలపల్లి 35వ బ్యాచ్ ట్రైనింగ్‌అటవీశాఖ సిబ్బంది శుక్రవారం వాంకిడి అంతర్రాష్ట్ర ఫారెస్ట్ చెక్‌పోస్టును సందర్శించారు. సరిహద్దులోని అటవీశాఖ స్థితిగతులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వారితోపాటు తెలంగాణ ఫారెస్టు అకాడమి ఏసీడీ రామ్మోహన్‌రావు, ఎఫ్ఎస్‌వో భగవంతురావు, ఎఫ్‌బీవో రజిత ఉన్నారు.

డీజీపీని కలిసిన ఎమ్మెల్యే హరీష్‌బాబు



డీజీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున ఎమ్మెల్యే హరీష్ బాబు

కాగజ్‌నగర్, జూలై 26: రాష్ట్ర డీజీపీ జితేందర్‌ను హైదరాబాద్‌లో శనివారం సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబు కలిశారు. ఇటీవలే రాష్ట్ర డీజీపీగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే జిల్లాలో నెలకొన్న సమస్యలపై కాసేపు చర్చించారు.

మంత్రి సీతక్కను కలిసిన ఎమ్మెల్సీ దండె విఠల్



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాగజ్‌నగర్, జూలై 26: మంత్రి సీతక్కను ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్ శనివారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా సిర్పూరు నియోజకవర్గంలోని వివిధ సమస్యలు, పెండింగ్ పనులను ఆమె దృష్టికి తీసుకవచ్చారు. నిధులు విడుదల చేయాలని కోరారు. మంత్రిని కలిసి వారిలో మాజీ జడ్పీచైర్మన్ సిడాం గణపతి, టీపీసీసీ మెంబర్ హర్షద్ హుస్సేన్, మాజీఎంపీపీ దుబ్బుల నానాయ్య, బసర్కార్ విశ్వనాథ్ తదితరులున్నారు.

205మంది రైతులకు రుణమాఫీ

జైనూర్, జూలై 26: మండలకేంద్రంలోని కేంద్ర సహకార బ్యాంక్‌లో లక్షలోపు రుణాలు తీసుకున్న 205మంది రైతులకు ప్రభుత్వం రుణాలను మాఫీ చేసిందని బ్యాంక్ మేనేజర్ సత్యశివాణి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం రుణాలమాఫీ జాబితాను విడుదలచేశారు. అదేవిధంగాతిరిగి రుణాలు మంజూరు చేస్తామని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



ఆసుపత్రిని సందర్శిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

వాంకిడి, జూలై 26: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అదనపుకలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గిరిజనఆశ్రమ బాలికలపాఠశాలను ఆకస్మికంగా సందర్శించి పాఠశాల ఆవరణ, తరగతి గదులు, వంటశాల, తాగునీటిసౌకర్యం, పారిశుధ్యం నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలం అయినందున డెంగ్యూ, మలేరియా, ఇతర విషజ్వరాలు, వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. తాగునీరు, ఆహారంఅందించే విషయంపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు నివాస పరిసరాలలో శుభ్రత ఆవశ్యకతపై విద్యార్థులకు వివరించి వారి తల్లిదండ్రులు, చుట్టు పక్కల వారికి అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాలలో తాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, ఇతర సదుపాయాలు కల్పిస్తామన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి జ్వరాలతో బాధపడుతున్న వారివివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవా లన్నారు. వైద్యశాలకు ప్రతిరోజు వస్తున్న రోగుల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ఆయన వెంట డీఎంహెచ్‌వో తుకారాం భట్, తదితరులున్నారు.

ఘనంగా కార్గిల్ దివస్



ర్యాలీలో పాల్గొన్న ఎక్స్ ఆర్మీజవానుల, అభిమానుల, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్

కాగజ్‌నగర్, జూలై 26: పట్టణంలో కార్గిల్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఇండస్ట్రీయల్ ఏరియానుంచి బైక్‌ర్యాలీ ప్రారంభించారు. అనంతరం ఆర్మీలో పనిచేసి పదవీవిరమణ పొందిన వారిని ఘనంగా సన్మానించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్‌శ్రీనివాస్ మాట్లాడుతూ కార్గిల్ వార్ దేశంలో మరుపులేని పోరాటమన్నారు. ఇందులో ఎంతో మంది సైనికులు అమరులైన వివరించారు. కార్యక్రమంలో ఎక్స్‌ఆర్మీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్, సభ్యులు పాల్గొన్నారు. అలాగే రిటైర్డ్ ఎంప్లాయ్స్ భవనంలో ఘనంగా కార్గిల్ దివస్ వేడుకలు నిర్వహించారు. ఎన్‌సీసీ ఫోర్స్ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఆకుల నాగేశ్వర్‌రావును ఘనంగా వాలతో సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ రాష్ట్రకార్యదర్శి మార్త సత్యనారాయణ, ఏఎస్ఆర్ మూర్తి, ఎల్లాగౌడ్, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

రెబ్బెన, జూలై 26: ఎలాంటి అనుమతులు లేకుండా ఎద్దులు, బర్రెలను అక్రమంగా తరలిస్తున్న నలుగురి వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపి వివరాల ప్రకారం కాగజ్‌నగర్ క్రాస్‌రోడ్డు వద్ద శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా కౌటాలనుంచి హైదరాబాద్‌కు ఎలాంటి అనుమతులు లేకుండా 15ఎద్దులు, 8బర్రెలు తీసుకెళ్లుతున్నట్టు తెలిపారు. ఈ మేరకు డ్రైవర్‌తోపాటు నలుగురిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

'పిల్లలను పనిలో పెడితే చర్యలు తప్పవు'

బెజ్జూరు, జూలై 26: బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని ఆపరేషన్‌ముస్కాన్-10 టీంలీడర్ రాజయ్య అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని పలుదుకాణాల్లో తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఇద్దరు పిల్లలను పనిలో పెట్టుకున్నట్లు గుర్తించడంతో వారికి కౌన్సిలింగ్ ఇచ్చి తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లలను పాఠశాలలకు పంపించాలని పనిలో పెట్టుకున్నట్లయితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అధికారి శ్రావణ్, కౌన్సిలర్ చంద్రశేఖర్, రవళి, పీసీ తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరారైన వ్యాపారుల కోసం పోలీసుల గాలింపు

కాగజ్‌నగర్, జూలై 26: పట్టణంలో పలువురు వ్యాపారులు డబ్బులు తీసుకొని తిరిగి చెల్లించక ఐపీలు పెట్టి చేతులెత్తేయటంతో పోలీసులు విచారణ ప్రారంభించారు. మూడురోజుల క్రితం కాగజ్‌నగర్‌లోని సీఎస్‌పీ సెంటర్ నిర్వాహకుడు ప్రశాంత్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. తమను మోసం చేశారని పలువురు వ్యాపారులు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. సీఎస్‌పీ సెంటర్ నిర్వాహకుడికి పట్టణంలోని పలువురు వ్యాపారులు వివిధ ఎకౌంట్లలో డబ్బులు వేసేందుకు ఇచ్చేవారు. నిత్యం నమ్మకంగా వ్యాపారం చేస్తుండటంతో కొంతమంది అడిగినంత అప్పులిచ్చారు. తిరిగి చెల్లించేనని తెలపడంతో కోర్టును ఆశ్రయించిన 37మందికి పదిహేను రోజుల క్రితం ఐపీ నోటీసులు జారీ చేశారు. దీంతో వ్యాపారులు ఖంగుతిన్నారు.

నెల రోజుల క్రితం కూడా ఓ చిట్టీ వ్యాపారీ పరారయ్యాడు. అతను కూడా కోట్ల మేర అప్పులు చేసినట్టు ప్రచారం జరుగుతోంది. మరి కొందరు కూడా ఐపీలు పెడుతున్న ట్లు ప్రచారం జరుగుతుండటంతో చిట్టీదారులు, అప్పులిచ్చిన వారంతా భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ విషయమై పట్టణ సీఐ శంకరయ్యను సంప్రదించగా సీఎస్పీ నిర్వాహకుడు ప్రశాంత్‌పై కేసు నమోదు చేశామన్నారు.



వృత్తిపరమైన వ్యాధులు రాకుండా జాగ్రత్తపడాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జీఎం, తదితరులు

శ్రీరాంపూర్, జూలై 26: సింగరేణి కార్మికులు వృత్తిపరమైన వ్యాధులురాకుండా జాగ్రత్తలు పాటించాలని డీఎంఎస్(మెడికల్) జార్జిజాన్ అన్నారు. "వృత్తిపరమైనఆరోగ్యసమస్యలు- భవిష్యతు ప్రణాళికలు" అనేఅంశంపై సీసీసీలోని సింగరేణి గెస్ట్‌హౌస్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జార్జిజాన్, సింగరేణి జీఎం(సేఫ్టీ) గురువయ్య, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుజాత హాజరయ్యారు. శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డితో కలిసి జ్యోతిప్రజ్వలనచేసి సదస్సును ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, సింగరేణి ఉద్యోగులు తాము చేస్తున్న పనివల్ల వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులోనూ ఎలాంటి సమస్యలు రాకుండా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి జీఎం రవిప్రసాద్, బెల్లంపల్లి, కొత్తగూడెం రీజియన్ రక్షణ జీఎంలు రఘుకుమార్, తివారి, ఇందారం, శ్రీరాంపూర్ ఓసీపీలపీవోలు పాల్గొన్నారు.

'50 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయండి'

శ్రీరాంపూర్, జూలై 26: శ్రీరాంపూర్ ఏరియాలో 50పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా కోరారు. శుక్రవారం శ్రీరాంపూర్ పర్యటనకు వచ్చిన సింగరేణిచీఫ్ మెడికల్ ఆఫీసర్ సుజాతకు వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ, సంస్థలోనే శ్రీరాంపూర్ అతి పెద్ద ఏరియా అని, 9వేలకు పైగా ఉద్యోగులు పనిచేస్తున్న ప్రాంతంలో కేవలం రెండుడిస్పెన్సరీలతో నెట్టుకొస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్‌కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్,పిట్‌కార్యదర్శి విజయలక్ష్మీ, నవీన్‌రెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ సెంటర్ ప్రారంభం

శ్రీరాంపూర్, జూలై 26: నస్పూర్ డిస్పెన్సరీలో సుమారు రూ.15లక్షలతో ఆధునీకరించిన ఆక్యుపేషనల్ హెల్త్‌సర్వీసెస్ సెంటర్‌ను రక్షణజీఎం గురువయ్య, శ్రీరాంపూర్ జీఎం బి సంజీవరెడ్డి, చీఫ్‌మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుజాత ప్రారంభించారు. ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా పలు సేవలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. హాస్పిటల్ మేనేజ్‌మెంట్ సిస్టంతో ఉద్యోగుల ఆరోగ్య వివరాలు రికార్డు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ జీఎం(సేఫ్టీ)రఘుకుమార్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, అధికారుల సంఘం అధ్యక్షుడు కె వెంకటేశ్వర్ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా క్వార్టర్ల కేటాయింపు

మందమర్రి టౌన్, జూలై 26: సింగరేణి ఉద్యోగులకు పారదర్శకంగా క్వార్టర్లను కేటా యించామని ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాముందర్ తెలిపారు. శుక్ర వారం సీఈఆర్‌క్లబ్‌లో క్వార్టర్ల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఏరియాలో 79క్వార్టర్లు ఖాళీగా ఉండగా 74మంది దరఖాస్తులు చేసుకున్నారని, దీనిలో సీనియర్ ప్రాతిపదికన 26మందికి కేటాయించామని తెలిపారు. కార్యక్రమంలో డీజీఎం ఐఈడీ రాజన్న, డీవైపీఎం మైత్రేయిబంధు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్కే5 గని పిట్‌కమిటీ

శ్రీరాంపూర్, జూలై 26: సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం(140/2018) ఆర్కే5 గని పిట్‌కమిటీని ఏరియా ఉపాధ్యక్షుడు దేగల ప్రవీణ్, కార్యదర్శి రెడపాక లక్ష్మణ్ సమక్షంలో ఎన్నుకున్నారు. పిట్‌కార్యదర్శిగా సుంధిళ్ల నరేష్, సహాయపిట్ కార్యదర్శిగా శ్రావణ్, ఏరియా జాయింట్ సెక్రెటరీగా సంకె సతీష్ ఎన్నికయ్యారు.

'సకాలంలో వేతనాలు చెల్లించాలి'

రామకృష్ణాపూర్, జూలై 26: రామకృష్ణాపూర్ సీహెచ్‌పీలో పనిచేస్తున్న రైల్వేసైడ్ కాంట్రా క్టుకార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించడంలేదని కాంట్రాక్టుకార్మిక సంఘం నాయకులు పేర్కొన్నారు. వేతనాలు రాకపోవడంతో కుటుంబాలను పోషించుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈవిషయంపై ఏరియాజీఎం దృష్టిసారిం చాలన్నారు. వెంటనే కాంట్రాక్టు కార్మికులకు వేతనాలుపడేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో కార్మికులు పెద్దలచ్చన్న, సీహెచ్ కొమురయ్య, కె లక్ష్మయ్య, మల్లయ్య, బానయ్య, శ్రీనివాస్, రామరాజు పాల్గొన్నారు.

శాంతిఖని గనిని సందర్శించిన జీఎం

బెల్లంపల్లి, జూలై 26: పట్టణంలోని శాంతిఖని గనిని శుక్రవారం మందమర్రి జీఎం మనోహర్ సందర్శించారు. గనిలోపల మ్యాన్‌రైడింగ్ చైర్‌లిఫ్ట్ కొనసాగింపు పనులను పరిశీలించి సూచనలను చేశారు. అలాగే బోల్టర్ మైనర్‌పరికరును పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ చైర్‌లిఫ్ట్ పనులను త్వరగా పూర్తిచేసి కార్మికులకు అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు. ఆయనవెంటప్రాజెక్టుఅధికారి విజయప్రసాద్, గ్రూపుఇంజనీర్ బసవరాజు, మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా తదితరులు ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ

కౌటాల: కౌటాల ఎంపీడీవోగా ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. చింతలమానేపల్లి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై కౌటాలకు వచ్చారు.

రెబ్బెన: రెబ్బెన తహసీల్దార్‌గా రామ్మోహన్‌ను నియమిస్తున్నట్టు కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఉత్తర్వులు జారీచేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేసిన జ్యోత్స్న మంచిర్యాలకు జిల్లాకు బదిలీ అయింది.

వాంకిడి: వాంకిడి తహసీల్దార్‌గా రియాజ్ అలీ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ రోహిత్ ఆసిఫాబాద్‌కు బదిలీఅయ్యారు. ఆసిఫాబాద్ జిల్లాకలెక్టరేట్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేసిన రియాజ్‌వాంకిడి తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు.

వాంకిడి: వాంకిడి ఎంపీడీవోగా నస్రుల్లాఖాన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో వరలక్ష్మి కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలానికి బదిలీపై వెళ్లగా పెంచికలపేట మండల సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న నస్రుల్లాఖాన్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు.

లింగాపూర్: మండల ఎంపీడీవోగా అంజద్‌పాషా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నావంతు బాధ్యతలను సమర్థంగా నిర్వహించి మండలప్రజలకు న్యాయం చేస్తానన్నారు.

బదిలీ అధికారులకు సన్మానం

సిర్పూర్(టి), జూలై 26: మండలంలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న సూపరింటెండెంట్ డీవీణ, కార్యదర్శి కృష్ణమూర్తి, జూనియర్‌అసిస్టెంట్ రాజ్‌కుమార్, ఆఫీస్ సబార్డినేట్ కిషన్‌ను శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బంది ఘనంగా సన్మానించారు.